www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 మార్చి 2023

5

పశ్చిమ గోదావరి



విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

తాడేపల్లిగూడెం: విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజర్ (హైదరాబాద్) డాక్టర్ ఎస్.ఎం.అరుణ్ ప్రకాష్ సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో బిటెక్ విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అరుణ్‌ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులు భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. లక్ష్యం సాధించాలనే తపన, పట్టుదలతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా రాణించొచ్చన్నారు. ఆధునిక డిజిటల్ ప్రపంచంలో ఉద్యోగ, ఉపాధి వ్యాపార అవకాలను అందిపుచ్చుకునేలా అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా వాటిని సృష్టించే స్థాయికి ఎదగాలని తెలిపారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఏయే కోర్సులుంటాయి, విద్యావిధానం ఎలా ఉంటుంది, స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు ఎలా చేసుకోవాలి వంటి విషయాల గురించి విద్యార్థులకు వివరించారు.

'బండ' బాదుడు..!


వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెంపు

జిల్లాలో వినియోగదారులపై రూ.మూడుకోట్ల భారం

వాణిజ్య సిలిండర్‌పైనా రూ.350.50 బాదుడు

రూ.2300కు చేరిన 19 కిలోల సిలిండర్ ధర

హోటళ్లలో పెరగనున్న టిఫిన్ ధరలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మోడీ సర్కార్ మరోసారి గ్యాస్ వినియోగదారులపై భారంమోపింది. వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 పెంచుతున్నట్లు చమురు కంపెనీలు ప్రకటించాయి. దీంతో వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ వినియోగదారులంతా లబోదిబోమంటున్నారు. గ్యాస్ ధర పెంపుతో వంటగ్యాస్ 14 కిలోల సిలిండర్ రూ.1150కు చేరుకోగా, 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.2,300కు చేరింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 8,14,847 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లాలో రోజుకు 21 వేలు, నెలకు ఆరు లక్షల సిలిండర్లను వినియోగదారులు ఉపయోగిస్తున్నారు. అడ్డూఅదుపు లేకుండా వంటగ్యాస్ సిలిండర్ పెరుగుతుండటంతో జనంపై పెనుభారం పడుతోంది. తాజాగా పెంచిన ధరతో జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు అదనంగా రూ.మూడు కోట్ల భారం పడనుంది. వంటగ్యాస్‌కు నగదు బదిలీ తెచ్చిన కేంద్రం గత కొంతకాలంగా సబ్సిడీని నిలిపివేసింది. గ్యాస్ సిలిండర్ ధరను ఒకవైపు పెంచుకుంటూపోతున్న మోడీ సర్కార్ సబ్సిడీకి మాత్రం ఎగనామం పెట్టడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంటగ్యాస్ ధర నెల, రెండు నెలలకొకసారి రూ.50 పెంచుకుంటూ పోతున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబానికి వంటగ్యాస్ సిలిండర్ నెలరోజులు వస్తుంది. నెలకు రూ.1150 వెచ్చించి సిలిండర్ కొనుగోలు చేయడం సామాన్య ప్రజానీకానికి పెనుభారంగా మారింది. కరోనా దెబ్బకు సామాన్య ప్రజల ఆదాయాలు గణనీయంగా పడిపోయాయి. ఎంతోమంది ఉపాధి కోల్పోయారు. అయినప్పటికీ ఏమాత్రమూ కనికరం లేకుండా మోడీ సర్కార్ ప్రజలపై భారాలు మోపుతోంది. ఇక భవిష్యత్‌లో వంటగ్యాస్ వదిలేసి కట్టెల పొయ్యి వినియోగిస్తే మంచిదనే అభిప్రాయం జనాల్లో వ్యక్తమవుతోంది.

వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెంపు

వ్యాపారులు వినియోగించే 19 కిలోల వాణిజ్య సిలిండర్‌పై ఒక్కసారిగా రూ.350.50 పెంచారు. దీంతో మొన్నటి వరకూ రూ.రెండు వేలలోపు ఉన్న సిలిండర్ ధర కాస్తా రూ.2300కు చేరింది. దీంతో హోటళ్లలో భోజనం, టిఫిన్ ధరలు విపరీతంగా పెరగనున్నాయి. ఇప్పటికే రెండు ఇడ్లీ రూ.35 పలుకుతోంది. ఇప్పుడు ఇది మరింత పెరగనుంది. ఇక దోసె, చపాతి, మినప అట్టు ధరలు ఇప్పటి వరకూ రూ.40 నుంచి రూ.50 ఉండగా వీటి ధరలు పెరిగే అవకాశం ఉంది. భోజనం ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.వంద వరకూ ఉండగా ఇకనుంచి భారీగా పెరగనున్నాయి. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. వంటనూనె ధర లీటర్ రూ.180 వరకూ ఉంది. పప్పుల ధరలు కిలో రూ.వందకు పైనే ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరగడంతో కూరగాయల ధరలు సైతం సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకుతున్నాయి. వంటగ్యాస్ ధర సైతం సామాన్యులకు పెనుభారంగా మారింది. కార్పొరేట్లకు అడ్డంగా దోచిపెడుతూ సామాన్య ప్రజానీకంపై భారాలు మోపుతున్న మోడీసర్కార్‌పై జనాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదేవిధంగా గ్యాస్ ధర పెరిగితే భవిష్యత్‌లో ప్రజలు ఏ విధంగా వంట చేసుకోవాలోనని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

గ్యాస్‌ధర పెంపును నిరసిస్తూ ఆందోళన



భీమవరం : పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ నాయకులు ఎం.వైకుంఠరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక 38వ వార్డు లంకపేటలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ గ్యాస్ సిలిండర్‌ను భుజాన మోస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1150కు పెంచిందని విమర్శించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను వ్యతిరేకించకుండా కేంద్రం చెప్పినట్లు ప్రజలపై భారాలు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, సోమేశ్వరం, కొమరగిరి సాయమ్మ, ఇమ్మానియేల్, రమేష్, కుమారి, మరియమ్మ, జ్యోతి పాల్గొన్నారు.


ఆకివీడు : స్థానిక 13వ వార్డు శ్రీనగర్ కాలనీలోని జెండా స్తూపం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు షేక్ వలి, రెడ్డి బంగారమ్మ, వాకాడ కస్తూరి, కొల్లి ఆదిలక్ష్మి, వహీద్, లాల్ బీబీ పాల్గొన్నారు.

తణుకురూరల్: గ్యాస్ ధర పెంపును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద గ్యాస్ సిలిండర్లతో సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ఇప్పటికే ప్రతీ వస్తువు మీద జిఎస్‌టి, పెట్రోల్, డీజిల్, విద్యుత్, రైల్వే ఛార్జీలు వంటి భారాలతో సతమతం అవుతుంటే మూలిగే నక్కపై తాటికాయపడ్డ చందంగా ఉందన్నారు. మోడీ పాలనలో ప్రజలకు ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తి లేక ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. కార్పొరేట్లకు పన్నులు తగ్గించి, రుణాలు మాఫీ చేసి ప్రజలపై భారాలు వేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, రేవు రాజేష్‌వర్మ, బి.శ్రీనివాసరావు, కెఎస్‌ఎస్.మణికంఠ, టి.ధనలక్ష్మి, ఆర్‌ఎస్.యామిని, మానస, నాగమణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

భీమవరం : బిజెపి ప్రభుత్వం వివిధ భారాలతో సామాన్యుల నడ్డి విరుస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఓట్లతో గెలిచి ప్రజలపై భారాలు మోపడం సమంజసం కాదన్నారు. వంట గ్యాస్ ధర ఏకంగా రూ.50 పెంచడం దారుణమన్నారు. ఈ పెంపును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గ్యాస్ సబ్సిడీని ఎత్తివేశారని గుర్తు చేశారు. గ్యాస్ ధర రోజు రోజుకీ పెంచుకుంటూ పోతున్నారని విమర్శించారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు కృషి చేయాలి

సంక్షేమ అభివద్ధి ఫలాలు అందరికీ అందాలి - రాష్ట్ర ప్రణాళిక కార్యదర్శి విజయ్ కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జిఎఎస్‌ఆర్‌కెఆర్.విజయ్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

'స్పందన'లో వచ్చిన ఫిర్యాదు మనదే అన్న దృక్పథం కలిగిన విధంగా అధికారులు పనిచేస్తే తప్పక సమస్యకు పూర్తి పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి జిఎఎస్‌ఆర్‌కెఆర్.విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఏలూరు ఆశ్రం ఆస్పత్రి మినీ ఆడిటోరియంలో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల కలెక్టర్లు, పోలీసు, క్షేత్రస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్పందన కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మానవ అభివృద్ధికి సంబంధించిన సుస్థిర అభివృద్ధి సూచీల సాధన కోసం ప్రతి ఒక్కరూ మనసు పెట్టి పని చేయాలన్నారు. ఏ పని ఎవరి కోసం చేస్తున్నాం, ఎందుకోసం చేస్తున్నాం అని ఆత్మావలోకనం చేసుకోవాలని, నిజమైన అభివృద్ధికోసం పని చేస్తున్న అవకాశం వచ్చినందుకు అదృష్టంగా భావించి ఇష్టం తో పని చేస్తే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరికీ అందజేసే క్రమంలో ఏ ఒక్కరినీ వదిలిపెట్టొద్దనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయగలిగితే సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 2016–2030 మిలీనియం అభివృద్ధి లక్ష్యాలను సాధించగలుగుతామని స్పష్టం చేశారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం 17 అంశాలను పలు సూచికలుగా నిర్దేశించిందన్నారు. సమీకృత అభివృద్ధికి లక్ష్యాల సాధనకు ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది అంశాలు, 18 లక్ష్యాలు, 56 సూచికలతో ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఇందులో ప్రధానంగా సామాజిక, ఆర్థిక, పర్యావరణ, పీస్ అండ్ పార్టనర్షిప్ అంశాలున్నాయని తెలిపారు. నీతిఆయోగ్ అమలు చేస్తున్న 115 ఎస్‌డిజి సుచీలలో జిల్లాస్థాయిలో 61, గ్రామ, వార్డ్‌స్థాయిలో 47 ప్రభుత్వ పథకాలను మ్యాపింగ్ చేశామన్నారు. నాణ్యమైన విద్యనందించడానికి అనేక సంస్కరణలు చేపట్టామని, విద్య కోసం అమలు చేస్తున్న పథకాలను ఎస్‌డిజి సుచీలకు మ్యాపింగ్ చేశామన్నారు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో అందిన స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించిన రెండు జిల్లాల కలెక్టర్లు ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిని విజయ్‌కుమార్ అభినందించారు. ప్రజల అవసరాలను గుర్తించడంలో, వాటిని సకాలంలో నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉందన్నారు. అర్జీదారు సంతృప్తిచెందే వరకూ అర్జీని పర్యవేక్షించే విధానాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు.

ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించే సమయంలో కోవిడ్ పరిస్థితుల్లో లాక్‌డౌన్, మరణాలు సంభవించడంతో అభివృద్ధి కొంత కుంటుపడిందన్నారు. అయితే మళ్లీ ఈ లక్ష్యాలను సాధించేందుకు రెట్టింపు స్థాయిలో గురి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఏ రంగంలో అయితే వెనక్కి తగ్గమో, అక్కడ పురోభివృద్ధి సాధించేందుకు గట్టి ప్రయత్నాలు చేయాలన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు జోడించామన్నారు. ఏలూరు జిల్లాకు సంబంధించి ఆయా ఇండికేటర్స్ లక్ష్యాలకు జిల్లాస్థాయి నోడల్ అధికారులను నియమించామని చెప్పారు. విద్య, వైద్యం, తదితర రంగాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. వివక్షకు తావులేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. అందిన దరఖాస్తులను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తున్నామన్నారు. 10 నెలల నుండి బియాండ్ ఎసెల్ ఎ గ్రీవెన్సెస్ పరిష్కార శాతాన్ని 2 శాతానికి తగ్గించామన్నారు. స్పందన దరఖాస్తులు రీఓపెన్‌ను 15.7 శాతం నుండి 3.6 శాతానికి తగ్గించామన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాల ద్వారా లక్ష్యాలు సాధిస్తున్నప్పటికీ సంబంధిత వివరాలు డేటా ఎంట్రీ చేయకపోవడం వల్ల ఆన్‌లైన్‌లో ప్రగతి ప్రతిబింబించడం లేదన్నారు. ఈ దృష్ట్యా ప్రతీశాఖ అధికారులు ఆయా వెబ్‌సైట్‌లను పరిశీలించి, వాటిలో డేటా ఎంట్రీ ఎలా చేయాలో అవగాహన పొందాలన్నారు. పరిష్కార మార్గం చూపడం ఒక ఆబ్జెక్ట్‌గా ఉండాలన్నారు. ఆయా సమస్యలను మానవీయ కోణంలో చూస్తే సమస్య పరిష్కరించడం కష్టమేమీ కాదని స్పష్టం చేశారు.

రాష్ట్ర పట్టణ పరిపాలనా శాఖ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ పురపాలనలో స్పందన, కాలుష్య నియంత్రణ తదితర అంశాలకు సంబంధించి ఎస్‌డిజి లక్ష్యాలను వివరించారు. స్పందన వినతులపై జె.జీవన్, గ్రామ, వార్డ్ వాలంటీర్ ఎస్‌డిజిలపై అనూష, క్వాలిటీ ఎడ్యుకేషన్‌పై డాక్టర్ విజయదుర్గ, హెల్త్ ఇండికేటర్స్‌పై శివశంకర్‌బాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై గీతా రాణి, మహిళా అభివృద్ధిపై రోజా రాణి, స్థానిక సంస్థల ఎస్‌డిజిలకు సంబంధించి ప్రసాద్, పట్టణాభివృద్ధి, పారిశుధ్యంపై రావీంద్రబాబు పవర్‌పాయింట్ ద్వారా అవగాహన కల్పించారు. ఏలూరుజిల్లా జెసి పి.అరుణ్ బాబు మాట్లాడుతూ ఎస్‌డిజిలపై ప్రణాళిక అంశాలు అత్యంత విలువైనవని, వాటిని గుర్తించి ఎస్‌డిజి సూచీల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ జిల్లా ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్యతేజ, సబ్ కలెక్టర్లు ఆదర్స్ రాజేంద్రన్, డిఆర్‌ఒలు ఎవిఎన్‌ఎస్.మూర్తి, కె.కృష్ణకుమారి, రెండు జిల్లాల ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి అభ్యర్థి చంద్రశేఖర్‌కు పంచాయతీ రాజ్ ఛాంబర్ మద్దతు

ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వీరవాసరం మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్‌కు జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ తరపున మద్దతు ఉంటుందని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సలహాదారులు పిల్లి సత్తిరాజు, జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షులు కడలి గోపాలరావు తెలిపారు. బుధవారం టిడిపి సానుభూతిపరులు ఎమ్మెల్సీ అభ్యర్థులకు పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున హోటల్ అతిథి కాన్ఫరెన్స్ హాల్లో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఛాంబర్ తరపున పోటీ చేసిన నలుగురిలో ఒకరిని మద్దతుగా ఎన్నుకున్నామని, కేవలం ప్రభుత్వం విధి విధానాలకు వ్యతిరేకంగా పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి పోటీల్లో పాల్గొంటున్నామని తెలిపారు. కడలి గోపాలరావు మాట్లాడుతూ ఎంపిటిసిలకు, జెడ్‌పిటిసిలకు, ఎంపిపిలకు, జెడ్‌పి ఛైర్మన్‌కు గౌరవవేతనాలు పెంచే వీలుగా తాము ఎన్నికల్లో బలమైన అభ్యర్థిని నిలబెడుతున్నామని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న సభ్యులంతా వీరవల్లి చంద్రశేఖర్‌ను బలపరచాలని, అదేవిధంగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. మిగిలిన సభ్యులంతా చంద్రశేఖర్‌ను బలపరిచేందుకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పర్యటించి ప్రచారం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, ఈ వ్యవస్థను బలోపేతం చేసేందుకు తాను పోటీ చేస్తున్నానని తెలిపారు. పంచాయతీరాజ్ ఛాంబర్‌లో అన్ని పార్టీలకు సంబంధించిన సభ్యులున్నారని తెలిపారు. ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, కౌన్సిలర్లు తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు గుంటుపల్లి సర్పంచి గోరింక దాసు, దేవరపల్లి ఆదాం, పసల వెంకటాచలం చంద్రశేఖర్‌కు పూర్తిమద్దతు తెలియజేస్తున్నామని ప్రకటించారు.

క్రమశిక్షణ కలిగిన వారికే టిడిపిలో పదవులు

జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి



మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం

క్రమశిక్షణ కలిగి అంకితభావంతో పనిచేసే వారికి టిడిపిలో పదవులు లభిస్తాయని పార్టీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. జిల్లా టిడిపి కార్యాలయంలో టిడిపి పట్టణ నూతన కార్యవర్గ కమిటీ ఎంపిక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన సీతారామలక్ష్మి మాట్లాడారు. భీమవరం పట్టణ సమీప గ్రామాలుగా ఉన్న చినఅమిరం, రాయలం, కొవ్వాడ, అన్నవరం, తాడేరు, భీమవరం మున్సిపాల్టీలో విలీన ప్రక్రియ కోర్టులో ఉన్నందున ప్రస్తుతం 39 వార్డులకు నూతన కమిటీ ఎంపిక జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ టిడిపి కోసం కష్టించి పనిచేసే వారిని పట్టణ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ పట్టణ కమిటీ అధ్యక్ష స్థానాన్ని ఎక్కువ మంది ఆశిస్తున్నారని, సరైన వారిని ఎంపిక చేసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ కమిటీలో విలీన గ్రామాల్లోని కార్యకర్తలను, నాయకులను పరిగణలోకి తీసుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్ మాట్లాడుతూ పట్టణ కమిటీ కన్వీనర్‌గా తనకు సహకరించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ కమిటీ అధ్యక్ష స్థానానికి మద్దుల రాము, చిరుకూరి రామకృష్ణచౌదరి, చల్లబోయిన సుబ్బారావు, కటికల పల్లారావు, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, బొకాం సూరిబాబు పోటీ చేయడంతో నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు 39 వార్డుల అధ్యక్ష కార్యదర్శుల అభిప్రాయాలను అడిగి తెలుసుకుని నివేదికను రాష్ట్ర పార్టీకి పంపనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి ప్రసాద్, టిడిపి నాయకులు మైలాబత్తుల ఐజాక్‌బాబు, సయ్యద్ నసీమాబేగం, ఎమ్‌డి షబీనా, బి.పద్మ, చల్లబోయిన సుబ్బారావు, ఎద్దు ఏసుపాదం, గుణపూడి తిరుపాల్, నౌషద్, గోపి, కోండ్రు శ్రీనివాస్, పంతం వెంకటసతీష్, వెంకటరామయ్య పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ప్రారంభం

ఛైర్‌పర్సన్‌గా మేరీ గ్రేస్ కుమారి బాధ్యతల స్వీకరణ


ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠాన్ని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఉమ్మడి ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ఛైర్‌పర్సన్ ఎ.మేరీగ్రేస్‌కుమారి బుధవారం బాధ్యతలు చేపట్టి, అనంతరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మేరీగ్రేస్‌కుమారి మాట్లాడుతూ 2002లో న్యాయ సేవాధికార సంస్థ చట్టం 1987 సవరణ ద్వారా ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దీని ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రజలు ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వారి సమస్యలు కోర్టులో వేయకుండా ఉన్నవారికి నేరుగా ఈ న్యాయ పీఠాన్ని ఆశ్రయించవచ్చని తెలిపారు. వీరికి న్యాయపరంగా ఉచితంగా సమస్యను పరిష్కరించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఇరుపార్టీల మధ్య రాజీ కుదరని పక్షంలో వారి వ్యాజ్యం, సమర్పించిన పత్రాలు పరిశీలనకు తీసుకుని అవార్డు ఇస్తామని చెప్పారు. శాశ్వత అవార్డు పొందిన తర్వాత ఈ అవార్డును వేరే కోర్టులో అప్పీలు, ఛాలెంజ్ చేసుకునే అవకాశం లేదన్నారు. ఈ ప్రజాప్రయోజనాలు శాశ్వత న్యాయ పీఠం కేసులు మార్చి ఒకటి నుంచి పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు.

ఈ న్యాయపీఠంలో10 సమస్యలకు సంబంధించిన కేసులను స్వీకరిస్తామని చెప్పారు. వీటిలో రవాణాకు చెందిన గాలి, రోడ్డు, నీటి సమస్యలు, తపాలా, టెలిఫోన్, టెలిగ్రాఫ్, సర్వీసెస్ సేవలు, తాగునీరు, విద్యుత్, సంబంధించిన సేవలు, పారిశుధ్యం, ఆసుపత్రి సర్వీస్, బీమా సేవలు, విద్య, విద్యాసంస్థల సమస్యలు, గృహాలు, రియల్ ఎస్టేట్ సేవలు, బ్యాంకు, ప్రయివేటు ఫైనాన్స్ సమస్యలు, ఉపాధి హామీకి సంబంధించిన సేవల్లో సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ ప్రజాప్రయోజనాలు శాశ్వత న్యాయ పీఠాన్ని ప్రజలందరూ సద్వినియం చేసుకొని సుఖంతమైన జీవితాన్ని గడపాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి ముందు ప్రజాప్రయోజనాల శాశ్వత న్యాయ పీఠం ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మేరీ గ్రేస్‌కుమారికి ప్రముఖన్యాయవాదులు, కోర్టు సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

కుక్కల స్వైర విహారం..

ఆందోళనలో ప్రజలు - పట్టించుకోని అధికారులు



గ్రామంలో సంచరిస్తున్న కుక్కలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు గుంపు గుంపులుగా సంచరిస్తూ వాహనదారులు, పాదచారులపై దాడిచేసి గాయపరుస్తున్నాయి. ప్రధానంగా మండల కేంద్రమైన ఆచంట, ఆచంట వేమవరం, వల్లూరు, కొడమంచిలి, పెనుమంచిలి గ్రామాల్లో కుక్కలు బెడద అధికంగా ఉంది. ఆయా గ్రామాల్లో కొంతకాలంగా కుక్కలు స్వైర విహారం చేస్తుండంతో కుక్కకాటు గురైన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. నెల రోజుల వ్యవధిలో మండలంలోని ఆయ గ్రామాల్లో సుమారు 50 మంది వరకూ కుక్కకాటు బారిన పడ్డారు.

ఆచంటలో ప్రధానంగా మార్కెట్, వెంకటేశ్వర స్వామి దేవస్థానం వీధి, కచేరీ సెంటర్, నటరాజ థియేటర్, కొత్తూరు సెంటర్ తదితర ప్రాంతాల్లో కుక్కలు గుంపు గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో చిన్నారుల నుంచి పెద్దల వరకూ రోడ్డుపై వెళ్లడానికి భయపడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళల్లో కుక్కలు బెడద ఎక్కువగా ఉంటుంది.

అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు..

సమస్యను గ్రామ పంచాయతీకి ఇతర అధికారులకు విన్నవించుకున్నా ప్రయోజనం ఉండడం లేదని పలువురు వాపోతున్నారు. అధికారులను ప్రశ్నిస్తే కుక్కలను పట్టుకోవడానికి అధికాకాలు లేవని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆయా గ్రామ పంచాయతీలో కుక్కలు పట్టించే ఏర్పాటు చేయాలని ప్రజల ముక్తకంఠంతో కోరుతున్నారు.

కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

సిర్రా నరసింహమూర్తి, పెనుమంచిలి



మండలంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. కనీసం ద్విచక్రవాహనంపై వెళ్లాలన్నా భయమేస్తోంది. అధికారులకు విన్నవించినా ప్రయోజనం ఉండడం లేదు. తక్షణం ప్రభుత్వం స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలి.

గుంపులు గుంపులుగా కుక్కలు..


తోటపల్లి సత్యనారాయణ. ఆచంట



ఆచంటలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయి గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. ఒంటరిగా వెళుతుంటే కుక్కలు వెంటపడి తరుముతున్నాయి. పంచాయతీ వారు కుక్కలు పట్టించే కార్యక్రమం తక్షణమే చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలి.

లంకగ్రామాల అభివృద్ధే ధ్యేయం

ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు



ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ శ్రీరంగనాథరాజు

ప్రజాశక్తి - ఆచంట

లంకగ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన కొనసాగిస్తున్నామని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం మండలంలోని కోడేరు పంచాయతీ పరిధి కోడేరులంక, పల్లెపాలెం, అయోధ్యలంక పంచాయతీ పరిధి పుచ్చలంక, నేతలవారిపాలెం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పాల్గొని సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సంక్షేమానికి అభివద్ధికి లక్షల కోట్లు వ్యయం ఖర్చు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయోధ్యలంక సర్పంచి కడలి కృష్ణవేణి వెంకటరెడ్డి, నాయకులు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

నరసాపురం : విద్యార్థులు పరీక్షల సమయంలో మానసిక ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని మానసిక వైద్య నిపుణులు జి.జెసు ప్రసాద్‌బాబు సూచించారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గౌతమి విద్యాసంస్థలో పదో తరగతి విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం ప్రభుత్వాసుపత్రి ఐసిటిసి కౌన్సిలర్ జేసు ప్రసాద్‌బాబు మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా పట్టించుకోవాలన్నారు. గౌతమి విద్యాసంస్థల డైరెక్టర్ చినమిల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు విద్యార్థుల కోసం ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం హర్షణీయమన్నారు. పట్టణ ఉపాధ్యక్షురాలు ఆర్.రాణి మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో కొంత మంది విద్యార్థులు పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక ఎన్నో ఇబ్బందులు పడ్డారని, అలాంటి ఇబ్బంది పడకుండా వారికి మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి కె.మనస్విని, ఇ.సన, ఫణికుమార్, అరవింద్‌రెడ్డి, అనిల్‌కుమార్, కెడి.ఎస్. వర్మ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే దోహదం

ప్రజాశక్తి - పాలకోడేరు

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే ఎంతో దోహదపడుతుందని విస్సాకోడేరు గ్రామ సర్పంచి బొల్లా శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో బుధవారం డ్రోన్ రీ సర్వే ప్రారంభమైంది. దీనిలో భాగంగా ఈ డ్రోన్ రీ సర్వేను సర్పంచి శ్రీనివాస్ సందర్శించి గ్రామానికి సంబంధించిన భూ వివరాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా సర్పంచి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ సమస్యల పరిష్కారానికి భూ రక్షణకు రీసర్వే చేపట్టిందన్నారు. సొంత భూములు, వివిధ రకాల పంటల ఆయకట్టు, ప్రభుత్వ భూములకు సంబంధించిన విస్తీర్ణం వంటి వివరాలన్నీ ఈ సర్వే ద్వారా పొందుపర్చడం జరుగుతుందన్నారు. రీసర్వేకు గ్రామస్తులు, రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిఎ రాంబాబు, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణరాజు, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఉపసర్పంచి కందుల నాగరాజు, కోఆప్షన్ సభ్యులు డిఆర్ స్వర్ణలత, మాజీ సర్పంచి పెనుమత్స శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


డ్రోన్‌ను పరిశీలిస్తున్న సర్పంచి శ్రీనివాస్, అధికారులు, ప్రజా ప్రతినిధులు


అవార్డు అందుకుంటున్న అధ్యాపకులు

క్రీడా పోటీల్లో ఎస్‌ఆర్‌కెఆర్ అధ్యాపకుల హవా

ప్రజాశక్తి - భీమవరంరూరల్

రాష్ట్రస్థాయి కాలేజీ టీచర్స్ షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో ఎస్‌ఆర్‌కెఆర్ అధ్యాపకుల డబుల్స్ టీం మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు చెప్పారు. గుంటూరులోని ఆర్‌విఆర్‌జెసి ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ కాలేజీ టీచర్స్ షటిల్ టోర్నమెంట్ జరిగింది. అందులో 45 ప్లస్ విభాగంలో డబుల్స్ విభాగంలో కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్‌బిఆర్‌కె.వర్మ, హ్యుమానిటీస్ విభాగం ప్రొఫెసర్ కె.కిరణ్‌కుమార్ వర్మ ప్రథమ స్థానంలో నిలిచి కప్పు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి విన్నర్స్‌గా నిలిచిన రవికుమార్‌వర్మను కిరణ్ కుమార్‌వర్మను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్‌ఆర్‌కె నిశాంత్ వర్మ ఘనంగా సత్కరించారు. కిరణ్ కుమార్ వర్మకు బెస్ట్‌ప్లేయర్ అవార్డు కూడా దక్కిందని చెప్పారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

బాల్య వివాహాలు చేయడం అనర్ధకమని సంస్కార్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ అడపా సత్యవతి అన్నారు. బుధవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో సంస్కార్ విద్యార్థులతో బాల్య వివాహాలు అనర్థాలపై ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 21 ఏళ్ల వయసు నిండిన వారికే వివాహం చేయాలని తెలిపారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ హేమలత, కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోమసుందర్

వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేసి సక్రమంగా పని చేయించాలని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ డిమాండ్ చేశారు. మాధవరంలో భవన నిర్మాణ కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం బుధవారం స్థానిక శివాలయం వద్ద గ్రామ సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో సోమసుందర్ మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును మన రాష్ట్రంలో నీరుకార్చడం బాధాకరమన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పోలి ఆదినారాయణ మాట్లాడుతూ కార్మిక సంఘాలు పోరాటం ద్వారా సత్తా చూపాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా యూనియన్ కార్యవర్గ సభ్యుడు పిల్లంగోళ్ల కృష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు, గ్రామ సంఘం అధ్యక్షుడు గంధం సత్యనారాయణ పాల్గొన్నారు.


పాలమూరులో తనిఖీ చేస్తున్న బృందం

పాలమూరులో ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంట్ర మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎన్‌ఆర్‌ఇజిఎస్ బృందానికి అధికారులు సహకరించాలని ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి అన్నారు. బుధవారం మండలంలోని పొలమూరు, నత్తారామేశ్వరం, కొయ్యేటిపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ మొదటి రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించి ఏయే శాఖలకు సంబంధించి అభివృద్ధి పనులు ఉన్నాయో వాటిని బృందం పరిశీలిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ రిసోర్స్ పర్సన్లు పొలమూరులో బి.రాజు, నత్తారామేశ్వరంలో జె.మార్కు, కొయ్యేటిపాడులో కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దమయపత్రి డ్రెయిన్ పూర్తి చేయాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో దమయపత్రి డ్రెయిన్ నిర్మాణం పూర్తి చేయాలని పట్టణ బిజెపి నేతలు మున్సిపల్ హైస్కూల్లో ఇంజినీర్ సాంబశివుడుకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా నిర్మాణం పూర్తిగాక పట్టణంలోని వార్డులు ముంపునకు గురవుతున్నాయన్నారు. వెంటనే నిర్మాణం పూర్తి చేసి ముంపు నుంచి రక్షించాలని కోరారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు జక్కంపూడి కుమార్, కార్యదర్శి కొండ ప్రసాద్, కోశాధికారి కొంజేటి గుప్తా పాల్గొన్నారు.

నేడు కడకట్లలో ఉచిత షుగర్ పరీక్షా శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక కడకట్లలోని జనతా ఆసుపత్రి ఆవరణలో ఈనెల 2వ తేదీ ఉదయం 7 గంటల నుండి 10 గంటల వరకూ ఉచిత షుగర్ రక్త పరీక్ష శిబిరం ఆదోని పెద వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, వంగపండు రామ్మోహనరావు తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, గ్రామ పరిసర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా తయారీకి బెల్లం అమ్మొద్దు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నాటుసారా తయారు చేసేవారికి బెల్లం అమ్మరాదని ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్‌పి ఎటివి.రవికుమార్ ఆదేశాల మేరకు గూడెం ఎస్ఇబి స్టేషన్ ఆవరణలో ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలోని కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్, బెల్లం వ్యాపారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరికైనా అధిక మొత్తంలో బెల్లం కొనుగోలు చేసేందుకు వస్తే వారి నుంచి సరైన ధ్రువపత్రాలు, కాపీలు తీసుకొని అమ్మాలని వ్యాపారాలకు సూచించారు. ఈ సమావేశంలో కిరాణా మర్చెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఈత కోట తాతాజీ, ఉపాధ్యక్షులు కొవ్వూరి నాగేంద్రరెడ్డి, వ్యాపారులు పాల్గొన్నారు.

స్టార్టప్‌లో విద్యార్థులు అగ్రస్థానంలో నిలవాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్టార్టప్స్ ఏర్పాటులో ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు అగ్రస్థానంలో నిలవాలని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత్ వర్మ పేర్కొన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎం.సురేష్‌బాబు పర్యవేక్షణలో బుధవారం భీమవరం ఆన్‌లైన్ క్యాంపస్ కేఫ్ బైఎస్‌ఆర్‌కెఆర్ ప్రారంభించారు. కళాశాల పూర్వ విద్యార్థి రాజశేఖర్ పర్యవేక్షణలో బ్లైండ్ పీపుల్ కోసం స్మార్ట్ విజన్ బైఎస్‌ఆర్‌కెఆర్ అనే స్టార్టర్‌ను టెక్నాలజీ సెంటర్ హెడ్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో రూపొందించారు. రెండు స్టార్టప్‌లకు ఇటీవల ఎన్ఐటి తాడేపల్లిగూడెంలో జరిగిన వాల్కాన్సి ఫెస్ట్ - 23లో రెండు బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని కళాశాలలో బుధవారం ఉదయం జరిగిన అభినందన కార్యక్రమంలో నిశాంత్ వర్మ విద్యార్థులను టెక్నాలజీ సెంటర్ హెడ్స్‌ను అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జగపతిరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు దేశం నలుమూలల జరిగిన పలు హేక్తాన్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొంది దేశంలోనే కళాశాలకు ఒక ప్రత్యేక స్థానం కల్పించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎన్.గోపాలకృష్ణమూర్తి, సిఎస్‌డి విభాగం హెడ్ ఎం.సురేష్‌బాబు పాల్గొన్నారు.


బహుమతులు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నిషాంత్ వర్మ


పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న ఎంపిటిసి అనూరాధ

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎంపిటిసి తనిఖీ

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంట్ర మండలం మార్టేరు తోకపేటలో నెం.40, 41 అంగన్వాడీ కేంద్రాలను మార్టేరు ఎంపిటిసి కర్రి అనూరాధ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి వారికి ఆహార పదార్థాలు అందుతున్నాయా లేదా వాటి నాణ్యతను రోజు వారీ మెనూను పరిశీలించారు. అనంతరం చిన్నారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గర్భిణులకు, చిన్న పిల్లలకు పోష్టికాహారం అందించేందుకు అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందేలా అంగన్వాడీ టీచర్లు చూడాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు , చిన్నారులకు పోషక విలువలతో కూడిన అనంతరం పిల్లలకు పెట్టే భోజనం రుచిచూశారు.

రైతు సంక్షేమమే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యం

ప్రజాశక్తి - ఉండి

రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మిన వ్యక్తి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని వైసిపి సోషల్ మీడియా జిల్లా కో ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాసదొరబాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం, భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం రైతు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఐదు సంవత్సరాల్లో ఆ హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల కోసం నూరు శాతం బీమా ప్రీమియంను భరిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. ప్రతి సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు ధాన్యం కొనుగోలు వంటివి అందుబాటులోకి తెచ్చారన్నారు. ధాన్యం కొనుగోలులో దళారుల పాత్ర లేకుండా నేరుగా రైతుల వద్ద నుండి ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులకు నష్టాలు లేకుండా చూస్తోందన్నారు. రైతే దేశానికి వెన్నెముక అని నమ్మి, రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన కొనసాగిస్తున్నారని తెలిపారు.

సోమేశ్వరస్వామికి రూ.11.40 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో గునుపూడిలో సోమేశ్వర జనార్ధన స్వామి వారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించినట్లు ఆలయ ఇఒ అరుణ్‌కుమార్ తెలిపారు. 97 రోజులకు గాను గ్రామస్తులు, యాత్రికులు, ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో హుండీ లెక్కించినట్లు తెలిపారు. మొత్తం రూ.11,40,352 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ధర్మకర్తల మండలి అధ్యక్షులు కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు పర్యవేక్షించారు.


హాస్టల్లో తనిఖీలు చేస్తున్న మహిళా కమిషన్ సభ్యురాలు వినీత

బాలికల హాస్టల్లో తనిఖీలు

ప్రజాశక్తి - పెనుగొండ

స్థానిక అంబేద్కర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ బాలికల హాస్టల్‌లో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోజూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు. అనంతరం వంటశాలను, బాత్ రూములను పరిశీలించారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నకా శ్యామల సోనిశాస్త్రి, వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకోడేరు

సివి రామన్ వంటి శాస్త్రవేత్తలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సర్వశిక్ష ఎపిసి పి.శ్యాంసుందర్ అన్నారు. పాలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సిఎంఒ రామకోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మూఢనమ్మకాలను శాస్త్రీయ పద్ధతి ద్వారా తిప్పికొట్టాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యాదర్శి ముల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సైన్సు ప్రయోగాలు, ముగ్గుల పోటీలు, క్విజ్ వంటి పోటీలో పాల్గొనడం వల్ల శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.రామలక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాతున్న ఎఇబి సిఐ సత్యవతి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పెనుగొండ

గంజాయి, కొకైన్, హెరైన్ వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే క్రమంగా ఆరోగ్యం పాడవ్వడంతో పాటు సమాజం తప్పుదారి పడుతుందని తణుకు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ సిఐ ఆర్.సత్యవతి స్పష్టం చేశారు. స్థానిక ఎస్‌వికెపి అండ్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ వైవివి అప్పారావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి స్థాయిలో చెడు అలవాట్లకు బానిసయ్యే అవకాశం ఉందని, జాగ్రత్తలు తీసుకోవాలని, మంచి స్నేహితులను కలిగిఉండాలని హితవు పలికారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ప్రిన్సిపల్ అప్పారావు మాట్లాడారు. మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి కె.చిరంజీవి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్ఎస్.శ్రీనివాస్, పి.మీరయ్య, టి.దివాకర్, కె.సురేష్‌బాబు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరులో 'జనంలోకి జనసేన'

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని కోట దగ్గర జనంలోకి జనసేన కార్యక్రమం ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ తిరిగి జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు ప్రజల్లో జనసేనకు ఆదరణ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి గోపీకృష్ణ, దూది బాబు, ఉప్పులూరి రాంబాబు, మాదిరెడ్డి బాలాజీ, లక్కు బాబి, అయితం చిన్ని పాల్గొన్నారు.

108 వాహనంలో మహిళ ప్రసవం

ప్రజాశక్తి - పోడూరు

108 వాహనంలో గర్భిణి ప్రసవించిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మట్టపర్రు గ్రామానికి చెందిన గర్భిణి బి.శిరీషకు ఉదయం 6 గంటల సమయంలో నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. కొద్దిసేపటికి గ్రామానికి వచ్చి హెచ్‌వి జయమని, ఎఎన్ఎం స్వాతి, ఆశ అమ్మజి పర్యవేక్షణలో 108 వాహనంలో ఆమెను పిహెచ్‌సికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే శిరీష ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారని వైద్య సిబ్బంది తెలిపారు. 108 సిబ్బంది కె.సత్యనారాయణ,పైలెట్ జి.ప్రసాద్ సేవలను, సిబ్బందిని అభినందించారు.

సీమంతం వేడుకలో శాసన మండలి చైర్మన్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ప్రముఖ రియాల్టర్, మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు కోడలు సీమంతం వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఆయన సతీమణి హాజరయ్యారు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు రూరల్ సర్కిల్ పరిధిలోని తణుకు రూరల్ పోలీస్ స్టేషన్, అత్తిలి, ఇరగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలకు పాల్పడిన ఐదుగురిని తణుకు రూరల్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నిందితుల నుండి రూ.2 లక్షల విలువైన 4 బ్యాటరీలు, 2 మేకలు, 13 మోటార్లు స్వాధీనం చేసుకున్నారు. తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను తణుకు రూరల్ ఎస్ఐ కె.గుర్రయ్య వెల్లడించారు. పెరవలి మండలం వెంకట్రాయపురం గ్రామానికి చెందిన ఎడ్ల శ్రీనివాస్ దొంగతనాలను వృత్తిగా చేసుకున్నాడు. ఈ క్రమంలోనే నిర్మాణంలో ఉన్న ఇళ్ల ఆవరణలోని వాటర్ మోటార్లను రాత్రి సమయంలో దొంగిలించేవాడు. యడ్ల శ్రీనివాస్‌ను పైడిపర్రు లోని తేతలి వైజంక్షన్ వద్ద అదుపులోనికి తీసుకుని అరెస్టు చేశామన్నారు. అయితే అతని వద్ద నుంచి తణుకు రూరల్, అత్తిలి, ఇరగవరం పోలీసు స్టేషన్లకు చెందిన 10 కేసుల్లో 13 మోటార్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో కేసులో తణుకు మండలం తేతలి గ్రామానికి చెందిన వజ్జిపర్తి రామదుర్గాప్రసాద్, ఉండ్రాజవరం మండలం వడ్లూరు గ్రామానికి చెందిన రెడ్డి కృష్ణ, దేవరపు రవి, సత్యవాడ గ్రామానికి చెందిన అగ్రహారపు దుర్గాప్రసాద్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్నారని తెలిపారు. నిందితులు నలుగురు రాత్రి సమయంలో రెండు మేకలు, 4 బ్యాటరీలు దొంగిలించారన్నారు. వారిని అరెస్టు చేశామని తెలిపారు. వారిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ గుర్రయ్య, కానిస్టేబుల్స్ అక్బర్, అన్వర్, మహేశ్వరరావు, మధవరావును ఎస్‌పి ఎం.రవిప్రకాష్, సిఐ సిహెచ్ ఆంజనేయులు అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ గుర్రయ్య

నేడు మహాధర్నాను విజయవంతం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - ఉండి

జగనన్న గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందజేయాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల రెండో తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు కోరారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు సరిపోక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా రూ.5 లక్షలు కేటాయించాలని కోరారు. ఈ మహాధర్నాలో జగనన్న, టిడ్కో గృహాల లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు సనపల శ్రీను, కోన గొల్లయ్య, పతివాడ గణపతి, షేక్ బాజీ, కొండ పాల్గొన్నారు.